క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బంట్వారం: తాండూరు సబ్ స్టేషన్‌లో పీటీఆర్ మరమ్మతుల కారణంగా ఆదివారం బంట్వారం, కోట్‌పల్లి మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ట్రాన్స్‌కో ఏఈ సురేష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ నిలిచిపోతుందని తెలిపారు. ఆ సమయంలో బంట్వారం, కోట్‌పల్లి సబ్ స్టేషన్ల పరిధిలో చెట్ల నరికివేత పనుల కారణంగా విద్యుత్ నిలిచిపోనుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రతి సోమవారం ప్రజావాణి

మోమిన్‌పేట: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రైతులు తమ సమస్యలను తగిన ఆధారాలతో ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

విహార యాత్రలో విద్యార్థులు



యాత్రలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

యాలాల: మండలంలోని రాస్నం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడు రోజుల పాటు విజ్ఞాన విహార యాత్రకు వెళ్లారు. శనివారం మేడారం, లక్నవరం ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం యునెస్కో గుర్తించిన రామప్ప ఆలయం, వరంగల్ కోట, వేయి స్తంభాల గుడిని సందర్శించనున్నట్లు హెచ్‌ఎం గాజుల వీరేశం తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక్ష అనుభూతి ద్వారా చరిత్ర పాఠాలు శాశ్వతంగా గుర్తుంచుకునేందుకు వీలుంటుందని చెప్పారు. యాత్రలో ఉపాధ్యాయులు లాజర్, మధుసూదన్‌రెడ్డి, 8,9,10వ తరగతి విద్యార్థులు ఉన్నారు.

మాయమాటలతో మభ్యపెడుతున్నారు..

అనంతగిరి: మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ హాత్‌సే హాత్‌జోడో కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మంచన్‌పల్లి సురేష్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆనంద్ నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారని, అన్ని గ్రామాలకు రూ.10 నుంచి 50 లక్షల వరకు నిధులు కేటాయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మాజీ మంత్రి గ్రామాల్లో పర్యటిస్తూ మాయ మాటలతో ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే హయాంలోనే వికారాబాద్ అన్ని విధాలా అభివృద్ధి చెందిందని తెలిపారు.

మొక్కల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ



నర్సరీని పరిశీలిస్తున్న సర్పంచి రాధిక

కుల్కచర్ల: నర్సరీ నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పీరంపల్లి సర్పంచ్ రాధిక అన్నారు. శనివారం గ్రామ పరిధిలోని నర్సరీని ఆమె పరిశీలించి మాట్లాడారు. మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామని, అందుకుగాను నర్సరీలో ఉన్న మొక్కలకు ప్రతిరోజు మూడు పర్యాయాలు నీరు పట్టడం, కలుపు మొక్కలు ఏరివేయడం వంటివి చేయిస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

మర్పల్లి: ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. పట్లూర్‌లో రెండో రోజైన శనివారం ఆంజనేయ స్వామి విగ్రహంతో పాటు గ్రామ దేవతల విగ్రహాలను బియ్యంతో కప్పి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలకు వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సతీమణి సబితానంద్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవంలో పాల్గొన్న డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్ గుప్తా, జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డితో పాటు ఉపాధ్యక్షుడు రాచన్నను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందిర, పార్టీ మండల ఉపాధ్యక్షుడు అశోక్, రమేష్‌మిత్ర, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పెద్దాపూర్ మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, గ్రామస్తులు రవి పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధికి పాదయాత్ర

బొంరాస్‌పేట: మహాశివరాత్రిన శ్రీశైలం మల్లన్నను దర్శించుకొని శివదీక్ష మాల విరమణ చేసేందుకు మండల పరిధిలోని రేగడిమైలారానికి చెందిన శివ భక్తులు 16మంది శనివారం పాదయాత్రగా బయలుదేరారు.

మూణ్నాళ్ల ముచ్చటేనా?

రైతు ఉత్పత్తిదారుల సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఏటేటా నష్టాలను మూటగట్టుకుంటుండడంతో కంపెనీ మూసివేతకే యాజమాన్యం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇంత వరకు ఇలా ఉన్నా.. సంస్థ ఏర్పాటుకు వెచ్చించిన నిధులు ఏమయ్యాయనే ప్రశ్న తలెత్తుతోంది.

- ఉత్పత్తిదారుల కంపెనీ మూసివేత?
- రైతుల నుంచి కూరగాయలు తీసుకోవడం లేదు
- అనంతగిరి ఆలుకు మంగళం
- గందరగోళంగా నిధుల వ్యవహారం
- తమవాట ఆవిరై పోయిందంటున్న మహిళా సంఘాలు





ఉత్పత్తిదారుల కార్యాలయం (ఇన్‌సెట్‌లో) ఆలును పరిచయం చేస్తున్న నాటి కలెక్టర్ పౌసమిబసు

మోమిన్‌పేట: అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ మూడు సంవత్సరాలకే మూసివేయనున్నట్లు సమాచారం. వరుస నష్టాలతో సంస్థ దివాలా తీసింది. ప్రస్తుత సంవత్సరం అనంతగిరి బ్రాండు ఆలు లేదు. ఏడాదిగా రైతుల నుంచి కూరగాయలు తీసుకోవడం లేదు. రావడం లేదు. కంపెనీ ఏర్పాటు కోసం సేకరించిన నిధులన్నీ మాయమయ్యాయి. డీఆర్‌డీఓ అధికారులు రూ.62 లక్షలకు పైగానే కొల్లగొట్టేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి నాణ్యమైన కూరగాయలను వినియోగదారులకు అందించాలనే లక్ష్యంతో అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ 2019–20లో ఏర్పాటైంది. అదే సంవత్సరం ఎన్‌ఆర్‌ఎల్‌ఎం (జాతీయ గ్రామీణ జీవనోపాధుల పథకం) కింద కేంద్ర ప్రభుత్వం రూ.50లక్షల నిధులను విడుదల చేసింది. రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో సభ్యులుగా చేరిన రైతులు.. సభ్యత్వ నమోదు కింద మూడేళ్లుగా రూ.1,37,600లు చెల్లించారు. అదే విధంగా గ్రామాల్లో ఏర్పాటైన మహిళా రైతు సంఘాల ద్వారా వాటా మూలధనం రూ.6,85,200లు చెల్లించారు. డీఆర్‌డీఓ ద్వారా కంపెనీకి రూ.3,88,828లు అందాయి. రెండేళ్లలో రైతుల నుంచి కూరగాయలను రూ.1 కోటి 37లక్షల 57వేల 493లను కొనుగోలు చేసిన సంస్థ.. హైదరాబాదులోని బెనిషాన్ కంపెనీకి విక్రయించింది. బెనిషాన్ కంపెనీ నుంచి ఆ రెండేళ్లలో రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి రూ.1 కోటి 48లక్షల 82వేల 615లు అందాయి. అంటే సుమారుగా ఈ రెండేళ్లలో లాభం కంటే నష్టాలే అధికంగా వచ్చినట్లు తెలుస్తోంది. కానీ 24 నెలల్లో పరిపాలన ఖర్చులు రూ.16లక్షల 63వేల 192 అయినట్లు అధికారికంగా సంస్థ వెల్లడించింది. సుమారు రూ.62లక్షలతో ప్రారంభించిన కంపెనీలో ప్రస్తుతం చిల్లిగవ్వ లేదని.. రైతు మహిళా సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నా.. అధికారులు నోరుమెదపడం లేదని వారు ఆరోపిస్తున్నారు. తమవాట మూలధనం కూడా ఆవిరై పోయిందని సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

ఏరువాక కేంద్రం ఏర్పాటు

మండల కేంద్రంలో అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి అదనంగా ఎన్‌ఆర్‌ఎల్‌ఎం రూ.27లక్షల నిధులతో రెండు ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లను రైతులకు సరసమైన ధరలకు అద్దెకు ఇచ్చేందుకు గతేడాది కొనుగోలు చేశారు. రూ.5లక్షలతో ఏరువాక కేంద్రం షెడ్‌ను నిర్మించారు. ప్రచారం లేక.. గ్రామాల్లో ఇప్పటికే ఉన్న ట్రాక్టర్ల పోటీని తట్టుకోలేక నామమాత్రంగానే నడుస్తున్నాయి. వాటి ద్వారా లాభం కాదుకదా.. ఆ వాహనాల సంరక్షణ ఖర్చుకూడా భారంగా మారింది.

గిట్టుబాటు కల్పించేందుకు

రైతులు పండించిన కూరగాయలకు గిట్టుబాటు కల్పిస్తూ వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను అందించాలనే లక్ష్యంతో అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీనీ ఏర్పాటు చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించారు. కానీ కంపెనీ నష్టాల్లోకి వెళ్లింది. పొలాల నుంచి నేరుగా కంపెనీకి తీసుకువచ్చేందుకు రవాణా, పంట కోసేందుకు కూలీలను కూడా సంస్థ భరించింది. కంపెనీలో సభ్యులుగా చేరి పండించిన వెజిటెబుల్స్‌ను కంపెనీకి విక్రయిస్తే గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వచ్చిన లాభాల్లో రైతులకు బోనస్ కూడా ఇస్తామని సంస్థ పేర్కొంది.

అనంతగిరి ఆలు..

గతేడాది అనంతగిరి ఆలు బ్రాండుపై వినియోగదారులకు కిలో ప్యాకెట్ల ద్వారా అందించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఇటు రైతులకు గిట్టుబాటు ధరను అందించడంతో పాటు అటు వినియోగదారులకు మార్కెట్ ధరకు అందించారు. మధ్య దళారులు లేకుండా నాణ్యమైన ఆలును వినియోగదారులకు అందించగలిగారు. గతేడాది నుంచి అనంతగిరి ఆలుకు మంగళం పాడారు. కలెక్టర్ పౌసమిబసు, ఇన్‌చార్జి సెర్ప్ సీఈఓ సందీప్‌కుమార్ సుల్తానియా ప్రోద్బలంతో కంపెనీని ముందుకు తీసుకు వెళ్లాలనే లక్ష్యంతో పనిచేశారు. కంపెనీలో సభ్యత్వం ఉన్న రైతులు పండిస్తున్న కూరగాయలకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందని అప్పట్లో తెలిపారు. కానీ ఏడాదిగా కూరగాయలు కొనుగోలు చేయడం లేదు.

ప్రజలు కోరితే పోటీకి సిద్ధం

- సేవచేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా
- డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

పరిగి: 'పార్టీ పెద్దల నిర్ణయం మేరకు నేను పనిచేస్తాను. ప్రజలు కోరితే పరిగి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నా' అని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవిలోకి రాకముందు రూ.800 కోట్లు ఉన్న డీసీసీబీని ప్రస్తుతం రూ.1600 కోట్లకు తీసుకెళ్లాన్నారు. బ్యాంకు ద్వారా ఎంతో మంది రైతులకు రుణాలు ఇచ్చామని తెలిపారు. పదవులకు ఆశపడి పనిచేయడం లేదని, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని ఆయన స్పష్టం చేశారు.

పుస్తకాల పంపిణీలో రాజకీయం లేదు

పదో తరగతి విద్యార్థులకు పుస్తకాల పంపిణీలో ఎలాంటి రాజకీయం లేదని, కేవలం బీఎంఆర్ ఫౌండేషన్ ద్వారా అందజేశామని డీసీసీబీ చైర్మన్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని, పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఏర్పాటు చేసి ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని ఆయన చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో కొందరు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, అది సరైన పద్ధతి కాదని హితవుపలికారు. విమర్శిస్తున్న వారు కూడా.. సేవా కార్యక్రమంలో పాలు పంచుకోవాలని, అందరం కలిసి పేదలకు సేవ చేద్దామని పిలుపునిచ్చారు. సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోకవర్ధన్‌రెడ్డి, కుల్కచర్ల జెడ్పీటీసీ రాందాస్, కుల్కచర్ల పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, నాయకులు బాబయ్య, రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, గిరిధర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, భాస్కర్ రెడ్డి, గంగాధర్, పాలాద్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి దంపతులు

పరిగి: మల్కాపూర్‌లో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి పూజ కార్యక్రమం అంగరంగా వైభవంగా జరిగింది. శివ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకకు ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి దంపతులు, మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామి వారికి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మల్లేశ్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూంల పేరిట మోసం

- పంటనష్ట పరిహారం, సబ్సిడీలు ఎత్తివేసిన బీఆర్‌ఎస్
- రాష్ట్ర ప్రభుత్వంపై మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ధ్వజం



ధారూరు: మహిళకు పార్టీ మేనిఫెస్టోను వివరిస్తున్న మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: కాంగ్రెస్ హయాంలో ఏడాదికి ఒక్కో గ్రామానికి వంద ఇళ్ల వరకు పేదలకు అందేవని, బీఆర్‌ఎస్ హయాంలో ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదని మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. హాత్‌సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని రాజాపూర్, మోమిన్‌ఖుర్దు గ్రామాల్లో పర్యటించి పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డబుల్ బెడ్‌రూంల పేరిట బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతుందని, ఇప్పటి వరకు ఒక్క ఇల్లు మంజూరు కాలేదంటే పేదలపై ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతోందని ఎద్దేవా చేశారు. ఏడాదికి రెండుసార్లు పంటనష్ట పరిహారం, వ్యవసాయ సబ్సిడీలు పూర్తిగా ఎత్తివేసి రైతులకు మొండిచేయి చూపిస్తుందని, రైతుబంధు పేరిట రైతులను ఆదుకుంటున్నట్లు ప్రకటిస్తుందని విమర్శించారు. నిరుద్యోగాన్ని పెంచిపోషించిన బీఆర్‌ఎస్, యువత ఉపాధికి రుణాలివ్వడం లేదని, మైనారిటీ కార్పొరేషన్ రుణాల పేరిట మండలంలో 40 గ్రామాలుంటే నలుగురికి మాత్రమే రుణాలు ఇస్తామనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అభివృద్ధిని విస్మరించి, ప్రజల్ని వంచిస్తున్న బీఆర్‌ఎస్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన చెప్పారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అప్పుడు ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, సర్పంచులు కిరణ్‌కుమార్‌రెడ్డి, బోడ అనిల్, నాయకులు మహ్మద్ బాబాకాన్, మల్లారెడ్డి, నారాయణరెడ్డి, బాబుమియా, మల్లికార్జున్, లింగసపల్లి అశోక్, ఆగమయ్య, శమీమ్‌పాష తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది సమస్యలపై పాదయాత్ర

- నేటి నుంచి జనగామ జిల్లాలో ప్రారంభం
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య



పాదయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న చంద్రయ్య తదితరులు

బొంరాస్‌పేట: గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య తెలిపారు. శనివారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పరిధిలో గోడపత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికులతో పనికితగిన వేతాలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయిస్తుందని ఆరోపించారు. 4వ లేబర్‌కోడ్‌ను రద్దు చేయాలని, కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లింపు, మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. స్పెషల్ స్టేటస్ కోసం సీఐటీయూ పోరాడుతోందని, ఈ నెల 12న జనగామ జిల్లా పాలకుర్తి నుంచి ప్రారంభమై 28న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వరకు తలపెట్టిన సీఐటీయూ పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో పంచాయతీ కార్మికులు డప్పు రాములు, సాయిలు, లక్ష్మమ్మ, కమలమ్మ, రామకృష్ణ, నర్సయ్య, అంజిలయ్య, బాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తారా?



ర్యాలీలో అఖిలపక్షం నాయకులు

- అఖిలపక్షం ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా
- నిందితులను శిక్షించాలని డిమాండ్

చేవెళ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని కించపరిచే మూర్ఖులను కఠినంగా శిక్షిస్తేనే మరొకరు ఇలాంటి సాహసం చేయరని అఖిలపక్షం నాయకులు అన్నారు. మండల కేంద్రంలో శనివారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో అఖిలపక్షం నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ ధర్నాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఐ, ప్రజా సంఘాలు, అంబేడ్కర్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హమారా ప్రసాద్ అనే మూర్ఖుడికి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలు అంబేడ్కర్ లాంటి మహనీయులను కీర్తిస్తుంటే కొందరు ఆయనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అరెస్టైన అతడిని కఠినంగా శిక్షిస్తేనే మరొకరు ఆరోపణలు చేసేందుకు భయపడిపోతారని తెలిపారు. అఖిలపక్షం నాయకుల ధర్నాతో హైదరాబాద్–బీజాపూర్ రహదారి ట్రాఫిక్‌తో స్తంభించిపోయింది. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, సత్యనారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్, సీపీఐ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ప్రభాకర్, రామస్వామి, వసంతం, శ్రీనివాస్‌గౌడ్, ప్రభులింగం ప్రభాకర్, సత్తిరెడ్డి, రవీందర్, సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పంతాలకు పోయి గొడవలు పెంచుకోవద్దు

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోండి: న్యాయమూర్తులు

పరిగి: రాజీయే రాజమార్గమని సివిల్ కోర్టు జడ్జి హరికుమార్ అన్నారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 381 కేసులను రాజీ ద్వారా పరిష్కరించి మాట్లాడారు. పంతాలకు పోయి గొడవలు పెంచుకోవద్దని సూచించారు. క్షణికావేశంలో చేసిన తప్పులు కేసులకు దారితీస్తాయని, కావున ఎలాంటి కేసులైనా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని సూచించారు. ఇరువురి రాజీతో కేసుల సమస్యలు తక్షణమే పరిష్కారమవుతాయని చెప్పారు. ఇందులో పరిష్కరించబడిన కేసులను.. అంతిమ పరిష్కారంగా పరిగణిస్తామని వెల్లడించారు. కావున కేసులు ఉన్న వారు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీపీ వెంకట్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేంద్రయాదవ్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



పరిగి: లోక్ అదాలత్‌లో జడ్జి హరికుమార్

లోక్ అదాలత్‌లో 108 కేసుల పరిష్కారం

తాండూరు: జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో విశ్రాంత న్యాయమూర్తి జనార్దన్ 108 కేసులకు రాజీ కుదిర్చారు. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో లోక్ అదాలత్‌కు వచ్చిన కేసుల్లో.. భరణం కేసులు 12, సీసీ(సీఏ)14, సివిల్ 04, ఎక్సైజ్ 18, సీసీ నేరం ఒప్పుకోలు 10, నేరపరిశోధనలో ఉన్న కేసులు 1, ఎస్‌టీసీ 49 కేసులకు పరిష్కార మార్గం చూపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్పన, సీనియర్ న్యాయవాదులు విజయ్‌కుమార్, శ్రీనివాస్, భవనప్ప, మనోహర్‌రావు, న్యాయవాదులు గోపాల్, రవికుమార్, పీ.సీ రెడ్డి, రవీందర్, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది, అర్జిదారులు తదితరులున్నారు.



తాండూరు: లోక్‌అదాలత్‌లో విశ్రాంత న్యాయమూర్తి, కక్షిదారులు తదితరులు

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి

కుల్కచర్ల: శివమాలధారణ అత్యంత పవిత్రమైందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శనివారం పుట్టపహడ్ సమీపంలో పాదయాత్రగా శ్రీశైలం వెళ్తున్న శివ భక్తులను సన్మానించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవడం వల్ల వ్యక్తి మానసిక పరివర్తన పొందడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మండల ఉపాధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, నాయకులు వెంకట్రాములు, శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

కుల్కచర్ల: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని వడ్డెర సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు అన్నారు. శనివారం చౌడాపూర్ మండలం వీరాపూర్ తదితర గ్రామాల నుంచి అసెంబ్లీ ముట్టడికి వడ్డెర్లు తరలివెళ్లగా.. వీరిని అసెంబ్లీ వద్ద అరెస్టు చేసి నాంపల్లి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్డెర్లను ఎస్టీలో చేర్చాలని సుదీర్ఘ కాలంగా కోరుతున్నా.. ప్రజాప్రతినిధులు ఎవరు కూడా అసెంబ్లీలో మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వడ్డెర్లను ఎస్టీల్లో చేర్చేవరకు తమ పోరాటం ఆగదన్నారు.

26 మందికి కంటి ఆపరేషన్లు

కొడంగల్: అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అందులో కంటి ఆపరేషన్లు అవసరమున్న 26 మందిని గుర్తించి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి కంటి వైద్యశాలకు తరలించి శుక్రవారం శస్త్రచికిత్స చేశారు. అనంతరం శనివారం ఉదయం కొడంగల్‌కు తీసుకొచ్చారు. వారికి ఆప్తాల్మిక్ అసిస్టెంట్ హరినాథ్ కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు.

రోడ్డు మలుపు ఇలా.. ప్రయాణం ఎలా?



ప్రమాదకరంగా ఉన్న కొత్తపల్లి మలుపు రోడ్డు

బంట్వారం: ప్రమాదకరంగా మలుపు తిరిగి ఉన్న ఈ రోడ్డులో ఎలా ప్రయాణం చేయాలంటూ వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ రాజ్ పరిధిలోని కొత్తపల్లి రోడ్డు మలుపులో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా.. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపించారు. కోట్‌పల్లి మండలం కొత్తపల్లి సమీపంలోని రోడ్డు యూ ఆకారంలో ఉంది. కోట్‌పల్లి నుంచి సుల్తాన్‌పూర్, బంట్వారం వెళ్లే వాహనదారులు ఎక్కువగా ఇటునుంచే పయనిస్తుంటారు. రోడ్డు ఇలా మలుపు తిరిగి ఉండడంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. రాత్రి వేళ అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. మలుపు వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

సేవాలాల్ జయంతిని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పరిగి: ఈనెల 15న పట్టణ కేంద్రంలో నిర్వహించే సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని జయప్రదం చేయాలని గిరిజన సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం పట్టణ కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారికంగా నిర్వహించే సేవాలాల్ జయంతిలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి గిరిజన బిడ్డలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ హరిశ్చందర్ నాయక్, కుల్కచర్ల జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, నాయకులు శ్రీనివాస్, హరిలాల్, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇచ్చేవరకు సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం పార్టీ విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జంగయ్య పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని, స్థలాలు ఉన్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలకు మొండి చేయి చూపించిందని మండిపడ్డారు. జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, పలు చోట్ల భూ కబ్జాలకు పాల్పడినట్లు తెలిపారు. కబ్జాదారుల నుంచి భూములను కాపాడి పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, కె. రామస్వామి, ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుధాకర్‌గౌడ్, సభుస్‌రెడ్డి, అంజయ్య, సత్తిరెడ్డి, మక్బుల్, సుధీర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.